ఆట అదుర్స్..

• పోలీస్ బ్యారెక్స్‌లో పోటీలను పరిశీలించిన జేసీ మయూర్ అశోక్



విజయనగరం: పోలీస్ బ్యారెక్స్‌లో జరుగుతున్న క్రీడా పోటీలను పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్, కమిషనర్ శ్రీరాములనాయుడు

విజయనగరం: రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తోన్న అతి పెద్ద క్రీడా పండుగ ఆడుదాం ఆంధ్రా పోటీలు విజయనగరం కార్పొరేషన్ పరిధిలో ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతున్నాయి. గురువారం స్థానిక రాజీవ్ క్రీడామైదానం, విజ్జీ స్టేడియం, అయోధ్య మైదానం, పోలీస్ బ్యారెక్స్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ మైదానం, పాలిటెక్నికల్ కళాశాల మైదానాలలో నిర్వహించిన పోటీల్లో 24 సచివాలయాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. వీరికి క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్ అంశాల్లో 62 మ్యాచ్‌లు నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు నగరంలోని పోలీస్ బ్యారెక్స్‌లో జరుగుతున్న పోటీలను పరిశీలించారు. ప్రతిభ గల క్రీడాకారులను వెలికితీయడంతో పాటు అన్ని వయస్సుల వారిని క్రీడాపరంగా ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తున్నట్లు జేసీ మయూర్ అశోక్ తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. విజేతలకు నగదు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు మాట్లాడుతూ, ఆరు మైదానాల్లో శుక్రవారం వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బోనెల ధనలక్ష్మి, వింత ప్రభాకరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజం..

పూసపాటిరేగ: క్రీడలతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందించవచ్చునని వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు బద్దుకొండ ప్రదీప్‌నాయుడు అన్నారు. మండలంలోని రెల్లివలస, కుమిలి-2, కందివలస సచివాలయాలకు సంబంధించి ఆడుదాం ఆంధ్రా క్రీడలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. రెల్లివలసలో బద్దుకొండ ప్రదీప్‌నాయుడు కబడ్డీ ఆడారు. కుమిలిలో జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు బౌలింగ్ చేయగా ప్రదీప్‌నాయుడు బ్యాటింగ్‌తో కాసేపు సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రదీప్‌నాయుడు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రీడలలో రాణించిన వ్యక్తులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మహంతి కల్యాణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి. అప్పలనాయుడు, మహంతి జనార్దనరావు, ఎస్. సత్యనారాయణరాజు, గుజ్జు సురేష్ రెడ్డి, పడాల శ్రీధర్, గాబు సూరప్పన్నరెడ్డి, దేశెట్టి గణేష్, ఎంపీడీఓ ఎం .రాధిక, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, ఎంఈఓలు రాజ్‌కుమార్, పాపినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీలో..

నెల్లిమర్ల: నగర పంచాయతీలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. స్థానిక థామస్‌పేట ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో నగర పంచాయతీకి సంబంధించిన సచివాలయాల పరిధిలో మూడు రోజులుగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కమిషనర్ పి. బాలాజీప్రసాద్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువతీ, యువకుల్లో క్రీడా ప్రతిభను వెలికితీయడానికి ప్రభుత్వం క్రీడాపోటీలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో పలువురు వార్డు కార్యదర్శులు, పీఈటీలు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా..

విజయనగరం రూరల్: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం – ఆంధ్రా క్రీడా పోటీలు మూడో రోజు గురువారం హోరాహోరీగా జరిగాయి. ఈ సందర్భంగా మండలంలోని కోరుకొండ, గుంకలాం, నారాయణపురం, ద్వారపూడి గ్రామాల్లో నిర్వహించిన పోటీలకు హాజరైన ఎంపీపీ అప్పలనాయుడు బ్యాడ్మింటన్, క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: కుమిలిలో క్రీడలను ప్రారంభిస్తున్న ప్రదీప్‌నాయుడు, కల్యాణి , అప్పలనాయుడు తదితరులు



విజయనగరం రూరల్: బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు



నెల్లిమర్ల రూరల్: వాలీబాల్ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ రామారావు



నెల్లిమర్ల: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కమిషనర్ బాలాజీప్రసాద్



విజయనగరం రూరల్: కోరుకొండలో కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

పరిశీలన..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థం ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఎంపీడీఓ గిడుతూరి రామారావు పరిశీలించారు. సచివాలయ సిబ్బందితో మాట్లాడి ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆడుదాం ఆంధ్రా పోటీలను క్రీడా మైదానాల వద్ద టెంట్లు, కుర్చీలు, మంచి నీళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు యశోద, సంతోష్, వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొలతలపై శిక్షణ



మేట్లకు కొలతలపై శిక్షణ ఇస్తున్న అధికారులు

బలిజిపేట: మేట్లు తప్పనిసరిగా కొలతలపై అవగాహన కలిగి ఉండాలని ఏపీఓ కేశవరావు తెలిపారు. గలావల్లి, నారన్నాయుడువలస, గంగాడ, వంతరాం, అంపావల్లి, నూకలవాడ, వెంగళరాయపురం పంచాయతీలకు చెందిన మేట్లకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి పనులకు ముందస్తుగా కొలతలు కొలిచి పనులు అప్పగించాలని సూచించారు. కొలతల ప్రకారం పనులు చేసేవారికి తగిన వేతనం వస్తుందన్న విషయాన్ని వేతనదారులకు తెలియజేయాలన్నారు. ఫేషియల్ యాప్‌లో వేతనదారుల హాజరు వేయాలని సూచించారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని గురువారం కనులపండువగా నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని అర్చకులు చాణక్య, శ్రీహర్ష, తేజ ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ సీతారాములకు స్నపనం, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం వేదమంత్రాల నడుమ అంగరంగ వైభవంగా కల్యాణం జరిపారు. ఉత్సవంలో ఆలయ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, మేనేజర్లు శ్రీనివాసరాజు, ఏవీ రమణ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ రవూఫ్‌కు సన్మానం



రవూఫ్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న తిరుమల ప్రసాద్

విజయనగరం ఫోర్ట్: గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్‌ను తిరుమల మెడికవర్ ఆస్పత్రి ఎం.డి డాక్టర్ తిరుమల ప్రసాద్ ఆస్పత్రిలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ, 11 ఏళ్లలో జిల్లాలో 1002 గుండె శస్త్రచికిత్సలు జరగగా.. అందులో 900 శస్త్రచికిత్సలకు రక్తం అందించిన ఘనత రవూఫ్‌కు దక్కిందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సెంట్రల్‌హెడ్ పద్మకుమార్, డాక్టర్ కరుణాకర్ పాండే, డాక్టర్ వాసుబాబు, డాక్టర్ శరత్‌కుమార్ పాత్రో, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ కార్మికులు

నెల్లిమర్ల: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి. బాబూరావు, బి. హరిబాబు, జె. శ్రీను, బి. రాము, టి. లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ విడుదల చేయాలి



కోట వద్ద నిరసన తెలియజేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

విజయనగరం పూల్‌బాగ్: మెగా డీఎస్సీ నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ హరీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కోట వద్ద నుంచి కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు సతీష్, డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

వైభవంగా అన్నకూటోత్సవం



వేపాడ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నకూటోత్సవంలో పాల్గొన్న భక్తులు



జామి మండలం పుష్పగిరిలో స్వామివారికి చిత్రాన్న నివేదన

వేపాడ: ధనుర్మాస పూజల్లో భాగంగా స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు రాపర్తి చిరంజీవి ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం అన్నకూటోత్సవం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రసాదాలు, స్వీట్లు, పండ్లు స్వామి వారికి నివేదించారు. అనంతరం స్వామివారికి అష్టోత్తర శత నామావళి, గద్యం, నక్షత్ర హారతి, కర్పూర హారతి, విశేష పూజలు నిర్వహించారు. ఎస్.కోట, వేపాడ మండలాల భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

స్వామివారికి తిరుప్పావడ సేవ

జామి: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అన్నంరాజుపేట పంచాయతీ పుష్పగిరి గ్రామంలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి వారికి గురు వారం తిరుప్పావడ సేవ నిర్వహించారు. ఆలయ ప్రధానఅర్చకులు ఫణిహారం సీతారామచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి 108 కిలోల చిత్రాన్నం ను నైవేద్యంగా నివేదిం చి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలో గోదాదేవి అమ్మవారి పల్లకిసేవ నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ



నిరుపేద మహిళకు దుప్పట్లు, నిత్యావసర వస్తువులు అందజేస్తున్న ఎస్పీ దీపిక

విజయనగరం క్రైమ్: వార్షిక తనిఖీల్లో భాగంగా ఎస్పీ ఎం.దీపిక గురువారం రాత్రి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ ప్రాంగణం, ప్రాపర్టీ రూమ్, స్టేషన్ రికార్డులు, సీడీ ఫైల్స్ తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. దర్యాప్తులో ఉన్న కేసుల సంఖ్యను గణనీయంగా తగ్గించినందుకు అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్టేషన్ సిబ్బందికి దత్తత ఇచ్చిన వార్డుల్లో సమస్యలు సృష్టించే వారిని గుర్తించి బైండోవర్ కేసులు పెట్టాలని సూచించారు. అనంతరం పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న యువతకు స్టడీ మెటీరియల్స్, నిరుపేద వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ ఆర్. గోవిందరావు, వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, సీసీఎస్ సీఐ సత్యనారాయణ, ఎస్సైలు భాస్కరరావు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు..

వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సనపల అజయ్‌కుమార్ ఇటీవల ఎస్సైగా ఎంపికయ్యాడు. దీంతో అతడ్ని ఎస్పీ దీపిక అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి..



సంక్షేమ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

• డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి
• 34వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

విజయనగరం: ఐదు కోట్ల మంది ఆంధ్రుల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి నిండు మనసుతో ఆశీర్వదించాలని విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి కోరారు. నగరంలోని 34వ డివిజన్ 41వ సచివాలయ పరిధిలో గురువారం సాయంత్రం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే లబ్ధి పొందిన ప్రభుత్వ పథకాల వివరాలతో కూడిన బుక్‌లెట్‌లను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగతోందన్నారు. ప్రతి ఇంటికీ ఏదో ఒక రూపంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని చెప్పారు. రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించడమే జగనన్న ధ్యేయమన్నారు. నగరంలో కోలగట్ల వీరభద్రస్వామి నేతతంలో అన్ని ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలు నిరాటంకంగా సాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాలి ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

నేడు రావివలసలో 'గడప గడపకు..'

భోగాపురం: మండలంలోని అమటాం రావివలస సచివాలయ పరిధిలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే బద్దుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరు కావాలని ఆమె కోరారు.

31లోగా పన్ను చెల్లించాలి

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని భవన యజమానులు, ఖాళీ స్థలాల యజమానులు ఈనెల 31లోగా ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఆస్తి పన్ను చెల్లించాలని అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో అర్ధ సంవత్సరపు పన్నును నిర్ణీత గడువులోగా చెల్లించి సహకరించాలని కోరారు. నెలాఖరులోగా చెల్లించని యజమానులు 2 శాతం అపరాధ రుసుంతో పన్ను మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

పెస్ట్ కంట్రోల్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న విశాఖ డీకేఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీ ప్రతినిధి డాక్టర్ మల్లారెడ్డి

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో పెస్ట్ కంట్రోల్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. ఎన్ఐపీహెచ్ఎం ఆధ్వర్యంలో రెండు రోజులు జరగనున్న శిక్షణ కార్యక్రమానికి విశాఖ డీకేఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీ ప్రతినిధి డాక్టర్ కె.మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కీటకాలు, చెద పురుగుల నివారణపై ప్రత్యామ్నాయ పద్ధతులు తెలుసుకోవాలన్నారు. డాక్టర్ పి.శక్తివేల్ మాట్లాడుతూ.. బొద్దింకలు, ఎలుకలు, నల్లుల నియంత్రణ, శానిటైజేషన్‌పై వివరించారు. కార్యక్రమంలో కె..వినోద్‌కుమార్, డి.ప్రకాశరావు, సత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిదేవమణి, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, లెఫ్టినెంట్ మజ్జి వరలక్ష్మి, జేఎస్ శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీపీటీఓ

విజయనగరం అర్బన్: ఆర్టీసీ ప్రయాణికుల కోసం శుక్రవారం 'డయల్ యువర్ ఆర్టీసీ డీపీటీఓ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్ అప్పలనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి నాలుగు వరకు 99592 25604 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు తెలియజేయాలని కోరారు.

పుష్కరిణి అభివృద్ధి పనులు ప్రారంభం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి బూడి ముత్యాలనాయుడు, ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బద్దుకొండ

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో భాస్కర పుష్కరిణి అభివృద్ధి పనులను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాలనాయుడు గురువారం ప్రారంభించారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి దేవస్థాన అర్చకులు, అధికారులు పూర్ణ కుంభంతో శాస్త్రోక్తంగా ఆహ్వానం పలికారు. స్వామిని దర్శించుకున్న అనంతరం కోనేరు వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బద్దుకొండ అప్పలనాయుడుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ మంత్రి ముత్యాలనాయుడు మాట్లాడుతూ, రూ. 75 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు అంధవరపు సూరిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమళ్లు వెంకటరమణ, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు రేగాన శ్రీనివాసరావు, నౌపాడ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం నాయుడు, ఈఓ కిషోర్‌కుమార్, నాయకులు కంచరాపు రాము, గేదెల రామ చిరంజీవి, తర్లాడ దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉంటాం

• డీసీసీ అధ్యక్షుడు రమేష్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న రమేష్‌కుమార్

విజయనగరం ఫోర్ట్: కాంగ్రెస్ పార్టీ పేద, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిందని డీసీసీ అధ్యక్షుడు సరగడం రమేష్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక డీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ 139వ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశానికి స్వాతంత్రం తీసుకొచ్చిన పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన స్వర్గీయ ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలు కాంగ్రెస్ పార్టీ నాయకులేనని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి సతీష్‌కుమార్, పీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు శ్రీనివాసరావు, జమ్ము ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'కనీస వేతన' ఉద్యోగులుగా గుర్తించండి



వినతిపత్రం అందుకుంటున్న ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావు

విజయనగరం అర్బన్: ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మినీ గురుకులాల్లోని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరారు. ఈ మేరకు ఏపీ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావును గురువారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, తక్కువ జీతాలతో జీవనం కొనసాగించడం చాలా ఇబ్బందిగా ఉందని.. 'కనీస వేతన' విధానం ఉద్యోగులుగా గుర్తించేలా చూడాలని కోరారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని శంకరరావు హామీ ఇచ్చారు.

ఉద్యోగుల వినతి

గిరిజన కార్పొరేషన్‌లో నెలకొన్ని దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంస్థ ఉద్యోగులు ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరావుకు గురువారం వినతి పత్రం అందజేశారు. 30 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నా ప్రమోషన్స్ లేవని వాపోయారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేసి పదోన్నతి కల్పించాలని కోరారు. చైర్మన్ స్పందిస్తూ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు.